జ్వరాలు.. వైరల్

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు
- ఏరియా ఆస్పత్రిలో వేధిస్తున్న సౌకర్యాల లేమి
- ఒకే బెడ్‌పై ఇద్దరికి చికిత్స


నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో ఓపీ విభాగం వద్ద బారులు తీరిన రోగులు

నక్కపల్లి: వాడవాడలా వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. వందల సంఖ్యలో వచ్చే రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. కీళ్ల నొప్పులు, జ్వరాలు, వంటి లక్షణాలతో ప్రజలు సతమతమవుతున్నారు. వైద్యం చేయడానికి సిబ్బందికి తలకు మించిన భారంగా మారింది. మారిన వాతావరణ పరిస్థితులు గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యల కారణంగా పలు గ్రామాల్లో అంటురోగాలు ప్రబలుతున్నాయి. రోజుల తరబడి జ్వరం, కీళ్ల నొప్పులు, విపరీతమైన నీరసం వంటి లక్షణాలతో బాధపడేవారు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వైద్యం


ఫార్మసీ వద్ద మందుల కోసం క్యూలో ఉన్న రోగులు

చేయించుకునే స్తోమత లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. మండల కేంద్రంలో ఉన్న ఏరియా ఆస్పత్రికి రోగులు బారులు తీరుతున్నారు. గతంలో 30 పడకల స్థాయిలో ఉన్న ఆస్పత్రిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 50 పడకల స్థాయికి పెంచి రూ.3 కోట్లతో అదనపు భవనాలు నిర్మించింది. అన్ని విభాగాలకు వైద్య నిపుణులను


రోగులతో నిండిపోయిన ఇన్‌పేషెంట్ వార్డులు

నియమించింది. దీంతో ఈ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఈ ఆస్పత్రికి నిత్యం ఓపీ 500 పైబడే ఉంటోందని సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లుగా చేరే వారి కోసం 50 పడకలు అందుబాటులో ఉన్నాయి. గత వారం రోజుల నుంచి జ్వర పీడితులతో ఈ బెడ్స్ అన్ని నిండిపోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో అత్యవసరం బట్టి ఒక్కొక్క బెడ్‌పై ఇద్దరిని ఉంచి వైద్యం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఓపీ విభాగం, ఫార్మసీ, వైద్యుల పరీక్షలు చేసే గదులు, ఎక్స్‌రే ప్లాంటు, ల్యాబ్‌ల వద్ద వందలాది మంది ఉదయం నుంచే క్యూలో వేచి ఉన్నారు. ఎక్స్‌రే ప్లాంట్ నుంచి ఆస్పత్రి మెయిన్ గేటు వరకు రోగులు క్యూలో ఉంటున్నారంటే జ్వరాల తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఓపీ కోసం వచ్చే వారిలో ఎక్కువ మంది జ్వర పీడితులే ఉంటున్నారు. అందరికీ పరీక్షలు చేసి, మందులు అందజేసి పంపించేటప్పటికి సాయంత్రం అవుతోందని, భోజన విరామం కూడా ఉండడం లేదని సిబ్బంది చెబుతున్నారు.

నియోజకవర్గంలోనే పెద్ద దిక్కుగా ఉన్న ఈ ఆస్పత్రికి నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. ఆర్థోపెడిక్, డెంటల్ విభాగం, కంటి విభాగం, పీడియాట్రీషియన్, గైనిక్ సమస్యలతో వచ్చే రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. ఇక్కడ ఎక్స్‌రే, ఈసీజీ, ఆర్థోపెడిక్ సేవలు అందుబాటులో ఉండటంతో రోగులు ఈ ఆస్పత్రికి రావడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. బెడ్స్ చాలకపోవడంతో కొంత మందిని బయట వరండాల్లో బెంచీల మీద పడుకోబెట్టి వైద్యం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏరియా ఆస్పత్రిల్లోనే కాకుండాగొడిచర్ల, మంగవరం, శ్రీరాంపురం, పాయకరావుపేట, ఎస్.రాయవరం, సర్వసిద్ధి, వెంకటాపురం, కోటవురట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది.

క్షీణించిన పారిశుధ్యం


చిన్న గుమ్ములూరులో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించింది. కాలువల్లో నెలల తరబడి పూడిక తీత చేపట్టకపోవడం, చెత్తను తొలగించకపోవడంతో ఎక్కడికక్కడ అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు పడిన సమయంలో బావులు, రక్షిత మంచినీటి పథకాలు, బావుల్లో క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహించిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. మరో వైపు దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంది. ఈ విషయమై ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా గ్రామాల్లో ముమ్మరంగా క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు . కాలువల పూడిక తీత, చెత్త తొలగింపు పనులు వెంటనే చేపడతామన్నారు. వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుని జ్వరాలు విజృంభించకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు.

ఐపీలో 3 నెలల్లో 450 మందికి చికిత్స


ఒక బెడ్‌పై ఇద్దరికి వైద్యం చేస్తున్న దృశ్యం

గత మూడు నెలల్లో 850 ఓపీ కేసులు నమోదు కాగా.. వారిలో 450 మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు. వీరిలో మలేరియాతో ఇద్దరు, డెంగీతో ఇద్దరు, 8 మంది టైఫాయిడ్‌కు చికిత్స తీసుకున్నారు. 280 మంది డయేరియాతో ఇన్ పేషెంట్లుగా చేరి చికిత్స పొందారు. ఎక్కువగా నక్కపల్లి చిన్న దొడ్డి గల్లు, చిన్న తీనర్ల, పెద్ద తీనర్ల, అడ్డురోడ్ కోరుప్రోలు తదితర గ్రామాల నుంచి రోగులు ఆస్పత్రిలో చేరుతున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

రోజు రోజుకూ ఓపీ పెరుగుతోంది..



వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వారికి సకాలంలో వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా చేస్తున్నాం. జ్వర పీడితులు కాచి చల్లార్చిన నీటిని తాగాలి. నిల్వ ఉన్న మాంసం, చేపలు తినరాదు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమల వల్లే వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయి. జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ శిరీష, మెడికల్ సూపరింటెండెంట్, నక్కపల్లి ఏరియా ఆస్పత్రి

క్లుప్తంగా

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి


మాత్రలు పంపిణీ చేస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: ఈ సీజన్‌లో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏఎన్‌ఎం రేవతి, వైద్య సిబ్బంది విల్లూరి జగన్నాథరావు రోగులకు పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ వర్షా కాలంలో ప్రజలు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి శ్రావణి మాట్లాడుతూ తాజా ఆహారంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

మునగపాక: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి కోరారు. మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో మంగళవారం స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రత పాటిస్తే ఏకాగ్రతతో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇష్టపడి, కష్టపడి చదువుకొని లక్ష్యం సాధించాలన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు


అన్నవరంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

కోటవురట్ల: చివరి దశలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో గతేడాది ఖరీఫ్ సీజనులో 1750 హెక్టార్లలో వరినాట్లు పడ్డాయి. ఈ ఏడాది కూడా వాతావరణం అనుకూలించడంతో అదే స్థాయిలో వరినాట్లు పడే అవకాశం ఉన్నట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సుమారు 1500 హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయి. మిగతా ప్రాంతాలలో రైతులు జోరుగా నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం అన్నవరం, జల్లూరు, బి.కె.పల్లి, లింగాపురం, కె.వెంకటాపురం, పాములవాక, నీలిగుంట, రామచంద్రపురం, కై లాసపట్నం, రాజుపేట ప్రాంతాలలో నాట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

తెలుగు పద్యాల పోటీల్లో శ్రీరామ్ ప్రతిభ


పద్యాల పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన శ్రీరామ్

ఎస్.రాయవరం: తెలుగు పద్యాల పోటీల్లో ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి బి.శ్రీరామ్ జిల్లా స్థాయిలో తృతీయ బహుమతి సాధించాడు. గత నెల 24న డైట్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ విధానంలో జరిగిన పద్యాల పోటీల్లో 9వ తరగతి చదువుతున్న శ్రీరామ్ పాల్గొని సత్తా చాటాడు. ఈ మేరకు శ్రీరామ్‌ను మంగళవారం పీఆర్‌టీయూ సంఘం నాయకుడు శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు, సంఘం నాయకులు, తల్లిదండ్రులు అభినందించారు.

అల్పపీడనంపై అప్రమత్తంగా ఉండాలి

మునగపాక: ఈ నెల 5 నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ కోరారు. మంగళవారం వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తుఫాన్ భవనాలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అల్పపీడన ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

కేజీబీవీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు


విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలోని కేజీబీవీలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుకన్య ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. బాలికలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఉన్న అన్ని కేజీబీవీల్లో గైనకాలజిస్ట్ పరీక్షలు, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారని ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన భవనాల చెంత విద్యార్థులను ఉంచరాదన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అవసరమైతే తరగతులను సురక్షిత ప్రాంతాల్లో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సలీమా, సిబ్బంది పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేయరూ..


నీలిగుంట రహదారిలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

కోటవురట్ల: రహదారులను పిచ్చిమొక్కలు కమ్మేస్తున్నాయి. అసలే ఇరుకు రోడ్లను పిచ్చిమొక్కలు ఆక్రమించడంతో మరింత చిక్కిపోతున్నాయి. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు పిచ్చిమొక్కలతో నిండిపోయి దారుణంగా ఉన్నాయి. చాలా కాలంగా అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వర్షాలకు పిచ్చిమొక్కలు మరింత ఏపుగా పెరిగిపోయాయి. అధికారులు స్పందించి రహదారుల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నేత్రదానంతో మరొకరికి చూపు


మాట్లాడుతున్న కంటి వైద్యులు

ఎస్.రాయవరం: నేత్ర దానం చేస్తే మరొకరికి చూపునిచ్చినట్టు అవుతుందని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ఎస్.వి.శక్తి ప్రియ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు పురస్కరించుకుని సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సులో ఉన్న వారు రోడ్డు ప్రమాదాలు, అనేక కారణాల వల్ల చనిపోతున్నారని, అలాంటి వారి కళ్లను దానం చేసినట్టయితే మరొకరికి కచ్చితంగా చూపు వస్తుందన్నారు. గ్రామాల్లో నేత్రదానంపై అవగాహన పెంచుకుని ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. పెనుగొల్లు పీహెచ్‌సీలో వైద్యాధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటి పరీక్ష వైద్యులు వెంకటరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కుమార స్వామి

నక్కపల్లి: గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నక్కపల్లి సీఐ కుమార స్వామి సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల అనుమతి కోసం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. ఇందులో భాగంగా 79950 95800 మొబైల్ నంబరుకు వాట్సప్‌లో హాయ్ అని సందేశం పంపిస్తే చాలన్నారు. నిరభ్యంతర పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్‌కు సందేశం రూపంలో ప్రజల మొబైల్‌కు వస్తుందని సీఐ చెప్పారు. టీటీటీ. జ్ఞుటఙ్జీఙ్పుతి.ౡఙౌ జీఛ్ఛి. జౌరి. జీ వెబ్‌సైట్‌లో గణేష్ మండపం ఏర్పాటు చేయదలిచిన కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేయు ప్రదేశం, విగ్రహం ఎత్తు, ప్రతిష్ఠ, నిమజ్జనం ఎప్పుడు ఎక్కడ ఏ సమయంలో చేస్తారు, ఏ వాహనంలో నిమజ్జనానికి తీసుకెళ్తారు, తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ దరఖాస్తు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు వెళ్తుందని, ఆ తరువాత పురపాలక, పంచాయతీ, అగ్నిమాపక, విద్యుత్ శాఖల సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శిస్తారని చెప్పారు. అన్ని సక్రమంగా ఉంటే దరఖాస్తును ఆమోదిస్తారన్నారు. అలాగే అనుమతి పత్రం కోసం అయ్యే రుసుం వివరాలు కూడా తెలియజేస్తారన్నారు. ఈ మొత్తాన్ని నిర్వాహకులు దగ్గరలో ఉన్న మీసేవా కేంద్రంలో చెల్లించి ఆ రశీదును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎస్‌హెచ్‌వో వాటిని పరిశీలించి వెంటనే నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారన్నారు. ఈ పత్రాన్ని ప్రింట్ తీసి గణేష్ మండపంలో అతికించాలని సీఐ సూచించారు.

హోటళ్లలో ఆహార పదార్థాల తనిఖీ


కె.కోటపాడులో హోటల్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ఎంపీడీవో అప్పలరాజు, డీటీ రమేష్

కె.కోటపాడు: హోటళ్లలో ప్రజలకు అందించే ఆహార పదార్థాల పాత్రలపై తప్పనిసరిగా మూతలు ఉండాలని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్ హోటళ్ల నిర్వాహకులకు సూచించారు. కె.కోటపాడులో నిర్వహిస్తున్న హోటళ్లను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. నిల్వ వంటకాలు విక్రయించరాదని, ఎప్పటికప్పుడు హోటళ్లను శుభ్రపరుచుకోవాలని ఆదేశించారు.

పెద్దేరు జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం


పెద్దేరు జలాశయం గేట్లు వద్ద వున్న నీరు

మాడుగుల రూరల్ : మాడుగుల మండలంలో పెద్దేరు జలాశయంలో నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది. వారం రోజులుగా కురుస్తున్న తుపాను వర్షాలకు జలాశయంలో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి జలాశయంలో నీటి మట్టం 135.45 మీటర్లకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 137 మీటర్లు ఉంది. కొండవాలు ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు 334 క్యూసెక్కులు నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోందని జలాశయం జేఈ సుధాకరరెడ్డి తెలిపారు. జలాశయం నుంచి 50 క్యూసెక్కుల నీరు రాచకట్టు ద్వారా, మరో 50 క్యూసెక్కుల నీరు ఆర్‌ఎంసీ ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్టు జేఈ తెలిపారు.

క్రమశిక్షణ కొరవడితే చర్యలు తప్పవు


రోలుగుంటలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈవో-2 జగ్గారావు, హెచ్‌ఎం ప్రసాదరావు

రోలుగుంట: విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవార్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని క్రమశిక్షణ కొరవడితే చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి -2 జగ్గారావు ఆదేశించారు. మండలంలో ఆయన మంగళవారం పలు పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల అవరణలో పరిసరాలు, విద్యార్థుల డ్రెసింగ్ విధానం, హెయిర్ స్టైల్‌ను పరిశీలించారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నోట్‌బుక్‌లు, ఉపాధ్యాయులు సబ్జెక్టు వైజుగా ఇస్తున్న హోమ్‌వర్కులు పరిశీలించారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు యూనిఫారం ధరించి పాఠశాలకు పార్థన సమయానికి వచ్చే అలవాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రార్థనలో నీతి వాక్యాలు చెప్పాలన్నారు. చదువట, రాయుట ప్రతి ఒక్కరికీ అలవాటు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేసి వంటకాల నాణ్యత పరిశీలించారు. విద్యార్థులకు ఇచ్చే అహారం రుచిగా, శుచిగా ఉండాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు.

వైన్‌షాపుల ఉద్యోగుల ధర్నా

నర్సీపట్నం : ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు మద్యం షాపుల ఉద్యోగులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ర్యాలీగా వెళ్లి అబిద్‌సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామరాజు, నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో 15,600 కుటుంబాలు వైన్‌షాపులపై అధారపడి జీవిస్తున్నాయన్నారు. ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



చీడికాడ పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు

చీడికాడ : కోల్‌కతాలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ దోషుల్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం పెదగోగాడ పీహెచ్‌సీ వద్ద ఆశ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు కామాక్షి మాట్లాడుతూ వేలాది మంది ప్రాణాలు కాపాడిన మహిళా వైద్యురాలికే ప్రాణ రక్షణ లేకుండా పోయిందన్నారు.

అందుబాటులోకి తుఫాన్ భవనాలు


తంతడి తుఫాన్ భవనం

మునగపాక(అచ్యుతాపురం): అస్నా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 5వ తేదీ నుంచి అల్పపీడనం ఏర్పడనున్న పరిస్థితుల్లో లోతట్టు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా అచ్యుతాపురం మండలం తంతడిలోని తుఫాన్ భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా సర్పంచ్ చోడపల్లి మురళి చర్యలు చేపట్టారు. భవనాన్ని శుభ్రం చేయించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు అధికారులు కూడా అస్నా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

గ్రామాల్లో ధార్మిక కమిటీలు వేయాలి


సమరసత ఫౌండేషన్ సమావేశంలో మాట్లాడుతున్న కొల్లి అప్పారావు

రాంబిల్లి(యలమంచిలి): గ్రామాల్లో ధార్మిక కమిటీలు ఏర్పాటు చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ ధర్మప్రచారకుడు కొల్లి అప్పారావు కోరారు. మంగళవారం రాంబిల్లి మండలంలో పైడితల్లమ్మ ఆలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడానికి, ధర్మ పరిరక్షణ కోసం మండల వ్యాప్తంగా ధార్మిక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాలు కేంద్రంగా ప్రతి వారం భజన, ప్రతి పౌర్ణమికి సామూహిక హారతి, ఏకాదశి నాడు నగర సంకీర్తన, ప్రతి రెండో శనివారం సత్సంగా కచ్చితంగా జరుగుతూ ఉండాలని సమసర సత సేవా ఫౌండేషన్ మండల సంయోజకులు సూరాడ సూకరాజు కోరారు. ఈ కార్యక్రమంలో చింతకాయల గగన్‌కుమార్, కుమార్, శేశెట్టి అప్పారావు, చక్రవర్తి, కారే రాముడు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి


పీఎల్ పురంలో సంపద తయారీ కేంద్రంలో వానపాములు విడిచి పెడుతున్న డీపీవో శిరీష

పాయకరావుపేట: తరచూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం లోపం తలెత్తకుండా ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని డీపీవో ఆర్.శిరీషారాణి అన్నారు. పాయకరావుపేట మండలం పీఎల్ పురం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో మంగళవారం వానపాములను విడిచి పెట్టారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదే విధంగా సత్యవరం, పెదరాంభద్రపురం, నామవరం గ్రామాల సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మట్లాడుతూ వర్షాలు కారణంగా గ్రామాల్లో డ్రైనేజీల్లో పూడికతీత ఎప్పటికప్పుడు తీయించాలన్నారు. మురుగునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టును తయారు చేయాలన్నారు. వ్యాధులు ప్రభలుకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రానీయొద్దన్నారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ ఇ.నాగలక్ష్మి, గ్రామ కార్యదర్శి వై.వి.సత్యనారాయణ, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో సకాలంలో వైద్యం అందాలి

కె.కోటపాడు: వర్షాల నేపథ్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకే పరిస్థితి ఉన్న దృష్ట్యా పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం సకాలంలో అందించేలా చర్యలను తీసుకోవాలని వైద్య సిబ్బందికి అనకాపల్లి జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. చౌడువాడ పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా ఆయా వయస్సులలో చిన్నారులకు అందించాల్సిందిగా తల్లిదండ్రులకు వైద్య సిబ్బంది వివరించాలని పేర్కొన్నారు. ఆస్పత్రిలో ల్యాబ్‌లో పీహెచ్‌సీలో జరగాల్సిన పరీక్షలు తప్పనిసరిగా చేయాలని చంద్రశేఖర్ సూచించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల ద్వారా ఎపిడమిక్ సీజన్‌లో ప్రజలు పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను ఎప్పటికప్పుడు వివరించాలని సూచించారు. వైద్యాధికారి నిర్మల, గణాంక అధికారి ఎ.రామచంద్రరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి రమణ పాల్గొన్నారు.